

-'శ్రీధర'

కుర్చీలో వెనక్కి చేరగిలబడింది కల్యాణి.

కృష్ణుడికి ఎలా ఉందో?

చేతి వాచీ వంక చూసుకున్న దామె. పదకొండూ పది.

పక్కనున్న ఫైల్సు వంక చూసింది. రెండు వరుసల్లో టేబులుమీద పడు కొని కునుకు తీస్తున్నాయి.

సన్నగా తలనొప్పి ఆరంభమైంది కల్యాణికి. నిజానికి ఆ తలనొప్పి పొద్దున్న నిద్ర లేచినప్పటి నుంచి ఉన్నది గాని, ఆ విషయాన్ని ఆమె గ్రహించింది మాత్రం ఇప్పుడే!

ఈ పూట ఆమెకు పని చెయ్య బుద్ధి కావటం లేదు. బద్ధకంగా ఉంది. యంత్రంకన్నా యాంత్రికమై పోయిన ఈ దినచర్య ఇనుపగుప్పిట నుంచి బయట పడి మనసు కింత శాంతిని, శరీరానికి కాస్తంత విశ్రాంతిని ఇవ్వాలని ఆమె కోరుకుంటున్నది. ఏమంత పెద్ద కోరిక అది? తన నిస్పృహాయతకి తనే నవ్వుకున్నది కల్యాణి. చివరికి ఎలాంటి పంజరంలో బందీ అయిపోయింది! కోరుకున్న కమనీయమైన కలల జలతారు పరదాలు కట్టిన బంగారు పంజరం కదూ ఇది?

ఆమె టైపు చేసి పెట్టిన పావురావు కాగితం శర్మగారి టేబులుమీద పేపరు వెయిట్ క్రింద ఫాన్ గాలికి రెపరెప లాడుతున్నది. దానివంక ఆ శర్మగారు ఓరకంట నయినా చూస్తాడేమోనని ఆమె ఆశ. అది తీరని ఆశ కావడానికి అందరాని దేవిూ ఆశించటం లే దామె. సాయంత్రం ఒక గంట ముందుగా ఆఫీసునుంచి వెళ్లటానికి అనుమతించమని వేడుకుంటు న్నది.

ఆయన టేబులు నిండా పేపరు పరిచి చాలా దీక్షగా చదువుతున్నాడు. ఆయన మీదనుంచి దృష్టిని పక్కనున్న ఎన్.జీవుని మీదకు మరల్చిం దామె. జీవుడు వంచిన తల ఎత్తకుండా పరీక్ష పేపరు వ్రాస్తున్న పిల్లవాడిలాగా శ్రద్ధగా నోట్ ఫైల్ వ్రాస్తున్నాడు. అతనెంత శ్రద్ధగా వ్రాసినా ఆ శర్మగారు దానినిండా గాట్లు పెట్టకా మానడు. అది తిరిగి తన దగ్గరకు రాకా మానదు.

"సాబ్ బులారే, సాబ్" అన్నాడు ప్యూను వచ్చి.

శర్మగారు పేపరు మడతపెట్టి, లేచి కోటు సవరించుకున్నాడు. ఆ కోటు

ఆయన ఉద్యోగంలో చేరిన కొత్తలో, దేశం బ్రిటిష్ వాళ్ల పాలనలో ఉన్నప్పుడు కుట్టించాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతికేళ్లు అయినా, ఆయన కోటుకు మాత్రం దాస్యవిముక్తి కాలేదు. రంగు వెలిసి పోయిందని అందరితో పాటు ఆయన భార్యా ఒప్పుకున్నందు వల్ల, ఈ మధ్యనే దాన్ని 'డ్రైయింగ్' మాత్రం చేయించాడు.

శర్మగారు బయటికి వెళ్లిన తరవాత పాండురంగం తలఎత్తి చూశాడు.

"ఏమిటలా ఉన్నారు?" అని అడిగింది కల్యాణి.

"నేనా? బాగానే ఉన్నానే" అన్నాడు పాండురంగం ఆశ్చర్యపోతూ.

"ఆఁ ఏం లేదు. చాలా సీరియస్‌గా పని చేస్తుంటేను, కారణం ఏమిటా అని?"

"అంటే, మీ ఉద్దేశ్యం? రోజూ నేను సీరియస్‌గా పని చెయ్యటం లేదనా?"

"అని నేను అన్నానా? అవునూ, ఇంకా మీరు పోస్టాఫీసుకు వెళ్లలేదేం?" అన్నది నవ్వుతూ.

"పోస్టాఫీసుకా? ఎందుకు?"

"ఏమో, నా కేం తెలుసు? ఆఫీసుకు వచ్చినప్పటినుంచి ఒక గంట టపాఖానాకి, ఒక గంట దవాఖానాకి, ఒక గంట ఖానాఖావాకి, ఒక గంట పా. . ." పకపకమని నవ్వింది కల్యాణి.

"నా శీలాన్ని శంకిస్తున్నారు మీరు" అన్నాడు పాండురంగం, ఆమెతో శ్రుతి కలుపుతూ.

"మీ శీలంమీద నాకు అపారమైన నమ్మకం ఉంది. మరి మీ ఆవిడ అభిప్రాయం ఏమిటో నాకు తెలియదు."

"భార్యల అభిప్రాయాలతో భర్తలకు అవసరం లేదు లెండి భారతదేశంలో."

"అయ్ అబ్జెక్ట్."

"సర్లెండి. నన్ను డిస్టర్బ్ చెయ్యకండి. ఈ వేళ సాయంత్రం ఒక గంట ముందు వెళ్లాలనుకుంటున్నాను. ఈ నాలుగు ఫైల్సు తోసేస్తే. . ."

"దేనికండీ ముందుగా వెళ్లటం?"


"బస్సు డిపోకి వెళ్లాలి."

"ఏం? మీ మదరిన్‌లాస్, బ్రదరిన్‌లాస్, సిస్టరిన్‌లాస్, సనిన్‌లాస్, ఫ్రెండు ఎవరన్నా వస్తున్నారా?" అని నవ్వింది కల్యాణి. మొన్నొక దూరపు చుట్టం గురించి చెబుతూ అలాంటి మాటలే వాడాడు అతను. అందుకని ఎద్దేవా చేసింది.

"అది కాదండీ. ఈ వేళ మా ఫామిలీని డిస్పాచ్ చేస్తున్నాను."

"శుభం. ఏమిటి కథ?"

"మా మరదలి పెళ్లి."



శ్రీ మహాదేవాలయం (కొల్హాపూర్)

ఫొటో— ఎస్. బి. సంధ్యావాత

"పూర్ ఫెలో! ఆమెకు నా సానుభూతి అందజెయ్యండి."

"మీ కంత జెలసీ పనికిరాదు సుమా" అన్నాడు పాండురంగం.

"నా కెందుకు జెలసీ?"

"పెళ్లయిన ఆడవాళ్లకి పెళ్లికాని ఆడపిల్లల్ని చూస్తే అదొక రకమైన ఈర్ష్య. తాము అప్పుడే పెద్దవాళ్లమయి పోయినామే అని దుగ్ధ. జీవితంలో ముఖ్యమైన దేదో అయిపోయిందే అని లోలోపల బాధ."

"ఏం కాదు. యు ఆర్ మిస్టేకెన్. ఏ ఆడపిల్ల అన్నా పెళ్లి చేసుకుంటున్నదని వింటే, నా కెందుకో బలిపీఠానికి గొనిపోయే మేకపిల్ల గుర్తొస్తుంది. విపరీతమైన జాలి కలుగుతుంది. . ." అన్నది కల్యాణి.

"మరి. . ." అని ఏదో అడగబోయాడు.

"నాకు తెలుసు, మీరు అడగబోయేదేమిటో? నా సంగతే కాదు, మీ సంగతే కాదు, ఎవరి సంగతయినా అంతే. వివాహానికి పూర్వం అదొక రంగుల స్వప్నం. అక్కడ అంతటా అరవిరిసిన ఆశల మొగ్గలు దూరానికి అందంగా కనపడి, అందర్నీ ఆకర్షిస్తాయి. ఆ కాస్సేపూ ఆ సుమదళాల పరిమళాలు మనసుకు మత్తెక్కిస్తాయి. వలపు తలపులు కనుల ముందు వలచని తెరలు దించేస్తాయి. ఆ తెరల మధ్యనుంచి, ఆ మత్తు వాసనలమంచి వగటి కలల వంక పరికించి చూస్తుంటే, అంతా వింతగా ఉంటుంది. పెళ్లి కాస్తా అయిపోయిన తరవాత మిగిలిపోయేది అమ్మాయికి అబ్బాయి, అబ్బాయికి అమ్మాయి. వాళ్ల భుజాల మీద బోలెడన్ని బాధ్యతలు. కాళ్లూ, చేతులూ కట్టి పడవేసే డబ్బు ఇబ్బందులు . . . ."

"స్వానుభవం అనుకుంటాను" అని నవ్వాడు పాండురంగం.

"అని అనుకున్నా ఇబ్బంది లేదు. అది మాత్రం కటిక నిజం" అన్నది కల్యాణి.

కాగితాల కట్టతో లోపలి కొచ్చిన శర్మగారు పాండురంగాన్ని పిలిచారు.

"ఎస్, సర్" అంటూ దిగ్గున లేచి ఆయన సీటు దగ్గరికి పరుగెత్తి అతి వినయంగా నిలబడ్డాడు, ఆ పాండురంగం అనబడే హంబుల్ సర్వెంట్. అప్పు డతణ్ణి చూస్తే భక్తి పారవశ్యంతో శ్రీరామచంద్రుని పాదసన్నిధిని నిలబడ్డ ఆంజనేయుడు గుర్తొచ్చి నవ్వుకున్నది కల్యాణి.

"చూడండి. ఇది గవర్నమెంటాఫ్ ఇండియా నుంచి వచ్చింది. రెండు రోజులనుంచి డెప్యూటీ ఛీఫ్ మరిచి పోయారట. ఈ వేళ లాస్ట్ డేట్. రిప్లై వెళ్లిపోవాలి. డ్రాఫ్టు పుటప్ చెయ్యండి. ఓ గంటలో పైకి పంపించమని చెప్పారు."

"ఎస్, సర్."

"ఎలాగైనా సరే, ఈ వేళ వెళ్లిపోవాలి."

"ఎస్, సర్."

"బాగా స్టడీ చేసి పుటప్ చెయ్యండి."

"ఎస్, సర్."

సూపరింటెండెంటు అందజేసిన ఆ ప్రసాదాన్ని అతి భద్రంగా తీసుకొచ్చి సీట్లో కూలబడ్డాడు పాండురంగం.

కల్యాణి టైపు చేస్తున్నది. శర్మగారి టేబులుమీద పేపర్‌వెయిట్ క్రింద రెపరెపలాడుతున్న పావు తావు కాగితం వంక చూస్తున్నది మధ్య మధ్యలో. మాటి మాటికి గడియారం చూసుకుంటున్నది.

'ఛీ, వెధవ వాచీలు ఎవడుకని పెట్టాడో ఎంతకీ కదిలి చావటం లేదు' అని తిట్టుకుంది. ఆగిపోయిందేమోనన్న అనుమానం వచ్చి, చెవి దగ్గర పెట్టుకుని చూసింది. నత్త నడక నడుస్తూనే ఉన్న దది.

పాండురంగం 'స్టడీ' చెయ్యటం అనే ఘోరతపస్సులో మునిగిపోయాడు. మిత్రుల కబుర్లతోను, పక్కవాళ్ల పిలుపులతోను అతనికి తపోభంగం కలగకుండా శర్మగారు వేయి కళ్లతో అతణ్ణి కాపాడుతున్నారు.

కల్యాణికి పిల్లవాడు గుర్తొచ్చాడు. వాడికి జ్వరం. గొంతెత్తి ఏడవటం తప్ప వాడి బాధను మరే విధంగానూ నోరు విప్పి చెప్పలేని పసివెధవ!. . . పెరిగి పెద్దయినాకూడా తన బాధ ఏమిటో పక్కవాడికి నోరు విప్పి చెప్పుకోలేని పాపాయి లెంతోమంది ఈనాడు మన మధ్య బ్రతుకుతున్నారు. ఉదాహరణకు తను, ఆయన, ఈ పాండురంగం . . . అందరిదీ ఒకటే క్లాసు.

పిల్లవాడికి కాపలాగా పనిపిల్లను పెట్టింది. మందు ఎప్పుడెప్పుడు ఇవ్వాలో మరీ మరీ చెప్పింది. గంట

# వింతలు విడ్డూరాలు

## సెక్సు పాఠాలు

పిల్లలకు లైంగిక విజ్ఞానం అవసరమా? మరి పిల్లలకు ప్రమాదంగానీ, యుక్త వయస్కులకు ఫరవాలేదేమో! మహారాష్ట్రలో సీనియర్ కాలేజీ విద్యార్థులకు సెక్సు పాఠాలు నేర్పుతున్నారు. దీనివల్ల యువతీ యువకులు లైంగిక విజ్ఞానం నేర్చుకుని, కుటుంబ నియంత్రణకు సహాయపడగలరని ప్రభుత్వం అభిప్రాయం. వైద్య నిపుణులు క్లాసులో ఉపన్యాసా లిస్తారు. తగిన సాహిత్యం అందిస్తారు. చలన చిత్రాలు చూపిస్తారు. అయితే, మగ, ఆడ పిల్లలకు వేర్వేరుగానే ఈ లైంగిక విద్యా బోధ జరుపుతారు. ఈ పద్ధతిని ప్రవేశపెట్టమని అన్ని కాలేజీల ప్రిన్సిపాల్స్‌కీ ఉత్తర్వులు పంపడం జరిగింది.

## ఆగడాలు

కర్ణాటక విశ్వవిద్యాలయంలో ఎమ్. ఏ. చదువుతున్న ఒక విద్యార్థి, మరో ఇద్దరు విద్యార్థులు కలిసి కాలేజీ ప్రిన్సిపాల్ ఇంట్లో దొంగతనం చేశారట. మంచి ఖరీదైన సైన్సు పుస్తకాలు, బట్టలు దొంగిలించారు. పుస్తకాలను బయట అమ్ముతుండగా పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద రెండువేల విలువ గల వస్తువులు దొరికాయి.

## వేసక్టమీ - టాప్ సిస్టమ్

అమెరికాలో కాంట్రాసెప్టివ్ ఇప్పుడు టాప్ సిస్టమ్‌లో లభ్యం అవుతున్నది. వేసక్టమీ చికిత్స చేసేటప్పుడే ఆ అరగంటలో పురుషుని వీర్య గ్రంథులకు బంగారంతో లేక స్టెయిన్‌లెస్ స్టీల్‌తో చేసిన టాప్‌ను అమర్చడం జరుగుతుంది. అది పెట్టుకున్న వ్యక్తి పిల్లలు కావాలనుకున్నప్పుడు డాక్టర్ దగ్గరికి వెడితే ఆ టాప్ తిప్పివేస్తాడు. నీళ్ల పంపు టాప్ తిప్పినట్లు దీన్ని తిప్పడమే. ఇది 9 మిల్లీమీటర్ల పొడవు, 4.5 మిల్లీమీటర్ల వెడల్పు ఉంటుంది. అందులో పైపును బంగారంతో, టాప్‌ను స్టెయిన్‌లెస్‌స్టీల్‌తో తయారు చేస్తారు.

## సూర్యప్రభలు

ఆగస్టు మొదటి వారంలో మనం గమనించని మహా ప్రళయం సంభవించింది. మూడు రోజుల పాటు భూమండల అయస్కాంత క్షేత్రం తీవ్ర సంక్షోభాలకు గురై అల్లకల్లోలం చెందింది. సూర్యమండలంలో మహాగ్ని జ్వాలలు లేచినప్పుడు విద్యుదయస్కాంత కణాల వాహిని భూమివైపు పయనిస్తూ ఉంటుంది. ఇది భూమి అయస్కాంత క్షేత్రాన్ని ఢీకొని, కల్లోలితం చేసి, రేడియో ప్రసారాలకు అవరోధం కల్పించి, భూమి వాతావరణంలో రమణీయ కాంతి దృశ్యాలను, ఇతర విచిత్రాలను సృష్టిస్తుంది. మొన్న అయస్కాంత తుఫాను తాకిడికి భూమి అయస్కాంత క్షేత్రం అనేకసార్లు స్పందించింది. మనకు రాత్రిగా ఉన్న సమయంలో సూర్యమండలంలో ఈ విద్యుదయస్కాంత ప్రభంజనం ఆవిర్భవించింది. ఇది సూర్యమండలం ఉపరితలంపై 2,800 మిలియనుల చదరపు మైళ్ల విస్తీర్ణంలో విస్తరించింది. వీటి తరంగాలు ఒక గంటలోనే భూమి ఉపరితలాన్ని చేరాయి. అప్పుడు కొన్ని నగరాలలో ప్రజలు ఆ నిశిరాత్రి వినువీథిలో దివ్యప్రభలు దర్శించారు. సూర్యమండలంలో చెలరేగిన ఈ అయస్కాంత వాయువు పది లక్షల హైడ్రోజన్ బాంబుల కన్న శక్తివంతమైనది. ఆ సమయంలో అంతరిక్ష పరిశోధకులు రోదసిలో ఉన్నట్లయితే చచ్చి ఉండేవారు. ఈ తరంగాల వల్ల కాన్సర్, వ్యాధిగాలు వచ్చే అవకాశం ఉన్నది. భూమిపై వాతావరణంలో ఉండే అయస్కాంత పరిధిని ఛేదించుకుని పృథ్వీతలాన్ని చేరిన అయస్కాంత తరంగాలు పది లక్షల సంవత్సరాల వరకు భూమికి విద్యుత్తును సరఫరా చేయగల శక్తి కలిగి ఉన్నాయి. సూర్యునిలో మనకు కనిపించే మచ్చలు ఈ విద్యుదయస్కాంత క్షేత్రాలే.

## నిరుద్యోగం

ఢిల్లీ రవాణా సంస్థ మొన్న 176 మంది పట్టభద్రులను బస్సు కండక్టర్లుగా నియమించింది. ఆ ఉద్యోగాలకు 323 మంది గ్రాడ్యుయేట్లు దరఖాస్తు పెట్టారు. పరీక్షలో 220 మంది నెగ్గారట. చదివే చదువులకు, చేసే ఉద్యోగాలకు సంబంధం లేకపోవడం మన దేశంలో చాలా కాలంగా వస్తున్నదే. పట్టభద్రుడికి అయినా కూడు, గుడ్డ ప్రధానం కదా!

## ప్లాస్టిక్ విమానం

గంటకు 50 నుండి 450 కిలోమీటర్ల వరకు వెళ్లగల ప్లాస్టిక్ విమానాన్ని ఒక జపాన్ సంస్థ కనిపెట్టింది. దీని ఖరీదు ఒక మోటారుకారు ఖరీదే! ఆరున్నర మీటర్ల పొడవు ఉండి, ఇద్దరు ప్రయాణం చేయడానికి అనువుగా ఉన్న ఈ ప్లాస్టిక్ విమానం వెల 35 వేల రూపాయలు.

—శార్వరి

---

సెలవు లేదు. కాకపోయినా, ఇప్పుడా ఇంట్లో తాండవిస్తున్న నిశ్శబ్దం చాలా భయంకరంగా ఉంది. స్నానాలు చేసి ఇద్దరూ మామూలుగా బస్సుస్టాప్‌కి వచ్చారు.

ఆఫీసుకు వచ్చిన పది నిమిషాలకే శర్మగారికి పిలుపు వచ్చింది. ఆయన వచ్చి కళ్యాణితో అన్నారు: "చీఫ్ మిమ్మల్ని పిలుస్తున్నారు."

"నన్నా?!" ఆశ్చర్యపోయింది.

"నా వంతు అయింది లెండి. మీరు వెళ్లిరండి. నిన్న మీరు సైపు చెయ్యటం లేటు అయిందట. మీ మూలంగా నాకు అక్షింతలు. మీరు సైపు చేసే దాకా ఉండి, సినిమాకి వెళ్లేటప్పటికి సినిమా మొదలయి పది నిమిషాలైందిట . . . చాలా కోపంగా ఉన్నారు . . . వెళ్లిరండి. . ."

కళ్యాణి వెళ్లి చీఫ్‌గారి ముందు ముద్దాయిలా నిలబడింది.

"మీరేనా సైపిస్టు?" అన్నారాయన తల ఎత్తి.

"ఎస్, సర్!"

"ఎన్నాళ్లనుంచి పని చేస్తున్నారు?"

"రెండేళ్ల నుంచండి. . ."

"నో, నో. యువర్ వర్క్ ఈజ్ నాటెటాల్ శాటిస్‌ఫాక్టరీ. యు హావ్ టు పికప్."

"ఎస్, సర్. . ."

"దట్సాల్. యు కెన్ గో" అని ఆయన మళ్లీ కాగితాల్లో తల దూర్చటం మంచిదయింది. కళ్యాణి కన్నీటి బొట్లు ఖరీదైన తివాసీ మీద పడినందుకు ఆయన మరింత కోపగించుకునేవారు లేకపోతే.

కళ్యాణి తిరిగి వచ్చేటప్పటికి, పాండురంగం శర్మగారి పక్కన వినయంగా నిలబడి ఉన్నాడు.

ఇలా అయితే లాభం లేదండి . . ."

"ఎస్, సర్. . ."

అతని ముఖం చూస్తే కళ్యాణికి అర్థమైపోయింది. రాత్రి అతని భార్యకి బస్సు అంది ఉండదు. ఆమె చెల్లెలి పెళ్లికి వెళ్లి ఉండదు. వాళ్ల వాళ్లు ఎవరూ పాండురంగాన్ని క్షమించలేరు. నిన్న కొన్న బస్సు టిక్కెట్ల కోసం అయిన అప్పు ఇప్పట్లో అతను తీర్చలేడుకూడా.

"ఎస్, సర్" అని అతను వచ్చి సీట్లో కూర్చున్నాడు.

ఆ పదాల మాటున, మాటిమాటికీ పగ్గాలేసి ఉగ్గబట్టుకుంటున్న వేదన, రోదన వాళ్లిద్దరికే తెలుసు, మరి. ✻